రమాయణం

**పోయినవారం చెప్పినట్లు.. నాకు చిన్నప్పటినుంచే చెట్లూ గుట్టలూ ఎక్కడం ఇష్టంగా ఉండేది. ఏదో ఒక చెట్టు ఎక్కడం.. పండ్లను తెంపుకొని తినడం నా అలవాటు. అంతేకాదు.. ఆ చెట్లు నన్ను అనేక రకాలుగా ఆదుకునేవి. చిన్నచిన్న ప్రమాదాల నుంచి కాపాడేవి కూడా! ఆ ముచ్చట్లు ఈ వారం మాట్లాడుకుందాం.**

# చెట్టు లెక్కగలవా? 2

మా పెరట్లో ఒక పెద్ద బాదం చెట్టు ఉండేది. కానీ, దాన్నిండా గండు చీమలుండేవి. కాబట్టి, దాన్ని ఎక్కేదాన్ని కాదు. అయితే, బాగా పండిన ఆ బాదం పళ్ల మాత్రం.. 'నను పాలింపగ నడచీ వచ్చితివా!' అన్నట్టు వాటంతట అవే రాలి కిందపడేవి. పైగా బాదం పలుకులు తినాలంటే బోలెడు ఎఫర్ట్ పెట్టి, ఆ కాయను కొట్టాలి. ఎలాగూ అమ్మో, నానమ్మో ఓ మూల కాయలు పోగయ్యాక బోలెడు కొట్టి పెడతారని చాలా క్లెవర్‌గా ఆలోచించి, ఆ చెట్టును మాత్రం వదిలేసేదాన్ని.

ఇక చింతచెట్టు ఎక్కే పనేలేదు. బాదం చెట్టులా దీని కొమ్మలు పెళుసు కాదు. చాలా ఫ్లెక్సిబుల్. పైగా కిందికి వేలాడే కొమ్మలకే గుత్తులు గుత్తులుగా బోలెడు ఓనగాయలు ఉండేవి. కొమ్మలు పట్టుకుని ఊగుతూ.. ఆ లేత చింతకాయలను తెంపి, ఉప్పు నంజుకుని తింటుంటే.. ఆ మజాయే వేరు! అన్నట్టు త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక పరీక్షల తేదీలు రాగానే.. నాన్న వెంటపడి మరీ ఈ చింతచెట్టుకే రెండు ఉయ్యాలలు కట్టించుకునేవాళ్లం.. నేనూ, అక్కా! రెండు పొడవాటి జనపనార తాళ్లు వేలాడదీసి, వాటి మధ్యలో తట్టు (గోనెసంచి) అమర్చేవాళ్లు. ఇక చూసుకోండి.. బడి నుంచి వచ్చి, ఏదో కాస్త తిని ఆ ఉయ్యాలల్లో ఊగుతూ.. పుస్తకం పట్టుకుని చదివితే, ఎంత పెద్ద పాఠమైనా నోటికి వచ్చేసేది.

పరీక్షలు అయిపోయాక కూడా.. ఆ ఊయలలు అలాగే ఉండేవి. వాటిని పట్టుకొనే రోజంతా ఆటలాడేవాళ్లం. పొద్దున్నుంచి సాయంత్రం దాకా.. ఊయలలు ఊగుతూనే ఉండేవాళ్లం.


మా ఇంట్లో రెండు పెద్ద రేగుచెట్లు ఉండేవి. ఒకటేమో చాలా పెద్ద కాయలది. ఆ కాయలు యాపిల్ పళ్ల రుచితో ఉండేవి. కానీ, ఎందుకో బాగా పుచ్చులు ఉండేవి. మా వాళ్లు ఉప్పూ, ఇంగువా.. ఇలా ఏవేవో పొదులో వేస్తూనే ఉండేవాళ్లు. ఈ రేగుచెట్టును అల్లుకుని పెండలం తీగ ఉండేది. దానికి పెండలం గడ్డలు కాస్తే వాటిని తెంపి మా వాళ్లు కూర వండేది. ఈ గడ్డలు అచ్చం కంద దుంపల్లా చిన్న సైజులో ఉండేవి. సరే! ముళ్ల చెట్టు ఎటూ ఎక్కం కాబట్టి.. ఆ రేగుచెట్టు మీద నాకు పెద్దగా ఇంట్రెస్ట్ ఉండేది కాదు.

మరో రేగుచెట్టు కాయల రుచి తింటే తప్ప చెబితే తెలిసేది కాదు. తీపి, పులుపు కలగలిసిన ఈ పళ్లను నాలుక పగుళ్లు వారేదాకా తినేవాళ్లం. ఈ చెట్టు ఎక్కకుండానే అంతకుమించిన ఏర్పాటుండేది. వంటింటి వెనకాల ఒక సందులో పెద్ద రోలు ఉండేది. పెద్ద ఎత్తున పప్పులూ, చింతకాయ లాంటివి నూరడానికి దాన్ని ఉపయోగించేవారు. ఆ రోలు పక్కన అమాయకంగా ఉండేది ఈ చెట్టు. పళ్లు విరగకాసేది. తెల్లారేసరికి పండిన పళ్లు ఆ సందు నిండా రాలిపడి ఉండేవి. నానమ్మ ఓపిగ్గా అన్నీ ఏరి బుట్టలో ఎత్తి పెట్టేది. అయితే మన ఛానల్ వేరే కదా!

పడమటి గది వైపు పెరటి ద్వారం ఉండేది. దాన్ని ఈజీగా ఎక్కి.. దాని పైనుంచి ఇంటి పైకప్పు ఎక్కాను ఓ రోజు. ఆ గూన పెంకుల మీద చప్పుడు కాకుండా పాకుతూ వంటింటి వైపు చేరుకొని.. కొలంబస్ అమెరికాను కనుగొన్నట్టుగా, మనసులోనే ఆనందంతో అరిచాను. రేగుచెట్టు కొమ్మలన్నీ గుత్తులు గుత్తులుగా పళ్లతో ఆ పెంకుల మీద వాలి ఉన్నాయి. పడుకుని నోటితో కూడా అందుకోవచ్చు. పైగా ముళ్లు గుచ్చుకోవు! నా నోట్లో నువ్వు గింజల్లా.. ఏ మాట ఎక్కువ సేపు ఆగదు. వెంటనే ఈ రహస్య మార్గాన్ని అక్కకు వివరించాను. మొదట్లో ''ఎందుకే!?'' అన్నా.. ఆ తరువాత తనూ అప్పుడప్పుడూ వచ్చేది.

ఆ చెట్టును ఆనుకుని ప్రహరీ, దాన్ని ఆనుకుని దారి.. ఆ పక్కనే రాతి బురుజు ఉండేవి. దారివెంట పోయే పిల్లలు ఆగి.. కోతుల్లాగా ఇంటి మీద ఉన్న మమ్మల్ని చూసి, ఎంతో ఆనందించి.. ''అబ్బ.. రెండు పండ్లు ఇయ్యరాదుండ్రి దొరసానీ!'' అని అడిగేవాళ్లు. దొరసానీ అనొద్దనీ.. 'భవతీ ఫలాం దేహి' అనమని వాళ్లకు చెప్పేదాన్ని. కానీ, వాళ్లు ఎంత ప్రయత్నించినా.. 'బవతి పల్లు దెయి' అంటూ జటాలు లేని భాషే వచ్చేది. పోనీలే అని లంగాలు పరిచి పట్టుకోమని.. వాళ్ల కోసం బోలెడు పళ్లు జాగ్రత్తగా విసిరేదాన్ని. మగపిల్లలకు నిక్కర్లు గనుక.. అమ్మాయిల్ని అడిగి పళ్లు తీసుకోవాల్సిందే!

కొన్నాళ్లకు ఈ రహస్య మార్గం గురించి నాన్నకు తెలిసింది. నానమ్మ వల్లే అని నా ప్రగాఢ విశ్వాసం. ''గూన పెంకులన్నీ ఇరుగుతున్నయ్! వానకాలం ఒస్తే ఇల్లంత కురుస్తది. మళ్ల కప్పియ్యాలె. గట్ల పండ్ల కోసం ఇల్లెక్కుతరా? నిచ్చెనేసుకోని తెంపుమందాం!'' అని నాన్న గట్టిగా చెప్పడంతో మా రేగు పళ్ల వేట ఆగిపోయింది. ■





**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**